క్లుప్తంగా

మంత్రి పొన్నం అభినందనలు



ప్రవల్లికను సన్మానిస్తున్న మంత్రి పొన్నం

బెజ్జంకి(సిద్దిపేట): చైనాలో జరిగే ఆసియా కప్ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన చెపూర్వ ప్రవల్లికను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. తన కార్యాలయంలో శనివారం ఆమెకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన నవీన్ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా ప్రవల్లికను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

కలెక్టర్ హైమావతికి శుభాకాంక్షలు



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న వెంకటయ్య

దుబ్బాక: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హైమావతికి శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్న మనుచౌదరికి వీడ్కోలు పలికారు.

మంత్రి వివేక్‌కు ఘనస్వాగతం



గజ్వేల్‌రూరల్: గజమాలతో స్వాగతం పలుకుతున్న నర్సారెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన గడ్డం వివేక్ వెంకటస్వామికి గజ్వేల్ కాంగ్రెస్ నేతలు ఘనస్వాగతం పలికారు. శనివారం హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తుండగా రిమ్మనగూడ సమీపంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాక: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వివేక్ వెంకటస్వామిని దుబ్బాక కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్, జిల్లా నాయకులు శ్రీరాం నరేందర్, రవి, శ్రీనివాస్, సురేశ్ తదితరులు ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సీఎం రేవంత్‌రెడ్డితో అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించినట్లు తెలిపారు. సిద్దిపేటలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సీఎం చెప్పినట్టు తెలిపారు.

రుణ మంజూరుకు సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

హుస్నాబాద్: ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ) స్కీంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో అధికారులు సర్వే చేపట్టారు. ఈ స్కీం ద్వారా మహిళా సంఘ సభ్యులకు రూ.లక్ష నుంచి రూ.30 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నారు. ఇందుకు గాను మొత్తం 12 దరఖాస్తులను స్వీకరించారు. రూ.10 లక్షల యూనిట్స్‌కు 35 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. సర్వేను మంత్రి పొన్నం ప్రభాకర్ పీఏ మల్లేశం పర్యవేక్షించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పలు ప్రాంతాలలో ఐదు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 29 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా శనివారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.27,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

బడిబాట విజయ బావుట

పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపండి.. కార్పొరేట్ చదువులు అందేలా చూస్తామంటూ తల్లిదండ్రులకు, గ్రామస్తులకు నమ్మకం కలిగించి సర్కారు బడి బలోపేతం చేసేందుకు ప్రధానోపాధ్యాయుడు జయప్రకాశ్‌రెడ్డి ఓ మార్గదర్శి అయ్యారు.

విద్యార్థుల కోసం భగీరథ యత్నం

- 70 మందిని చేర్చిన హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డి
- యేడాది పొడవునా ఆటో సౌకర్యం
- రూ.4 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- తల్లిదండ్రులు, గ్రామస్తుల అభినందనలు



విద్యార్థుల తల్లిదండ్రులకు కరపత్రం ఇస్తున్న హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాలలో జయప్రకాశ్‌రెడ్డి హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. వేసవి సెలవుల్లో ప్రభుత్వ సూచనల మేరకు పాఠశాలల బలోపేతం కోసం ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరిగి చిన్నారుల గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

తల్లిదండ్రుల ఆవేదన

ప్రభుత్వ పాఠశాలలో విద్య సరిగా బోధించరని, పాఠశాలల యాజమాన్యాలు బస్సు సౌకర్యం కూడా కల్పిస్తున్నాయని కొందరు తల్లిదండ్రులు ఆయనతో అన్నారు. ఊరు చివర్లో ఉన్న పిల్లలు ప్రభుత్వ పాఠశాలకు నడుచుకుంటూ రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని, అలాగే కుక్కల బెడదతో భయపడి రాలేకపోతున్నారని వివరించారు.

ఆ బాధ్యత మాదే..



జయప్రకాశ్‌రెడ్డి

పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్య అందేలా ఉపాధ్యాయులంతా చూసుకుంటామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. అలాగే బీసీ, ఎస్సీ కాలనీల పిల్లలను ప్రతిరోజు పాఠశాలకు వచ్చేందుకు రెండు ఆటోలను ఏర్పాటు చేస్తానని, ఆటోలను తన సొంత ఖర్చులతో యేడాది పొడవునా ఏర్పాటు చేస్తామని హెచ్‌ఎం హామీ ఇచ్చారు. ఆ రెండు కాలనీల్లో ప్రధాన చౌరస్తాల వద్ద సోమవారం నుంచి ఉదయం 8 గంటలకు రెండు ఆటోలు ఉండేలా ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. ప్రతి ఆటో రెండేసి ట్రిప్పులు వేస్తాయని చెప్పారు. అదే విధంగా రూ.4 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్, భవనానికి రంగులు వేయించడం, క్రీడా దుస్తులుతోపాటు మరిన్ని వసతులను కల్పించారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, ఇతర వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు.

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలకు

కొండపాక, దుద్దెడలోని ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే సుమారు 70 మంది విద్యార్థులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. దీంతో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 210కి చేరింది. మరో వారం రోజుల్లో మరి కొందరు విద్యార్థులు చేరతారని హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి హెచ్‌ఎం కృషికి గ్రామస్తులు, నాయకులు అభినందనలు తెలియజేస్తున్నారు.



మనుచౌదరిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత పూజల హరికృష్ణ తదితరులు

మనుచౌదరి కృషి అభినందనీయం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తూ, కలెక్టర్‌గా జిల్లాను అభివృద్ధిలో ముందుకు నడిపించిన మిక్కిలినేని మను చౌదరి సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ప్రశంసించారు. బదిలీపై వెళ్తున్న ఆయనను కలెక్టరేట్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా వరకు అన్ని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ అధికారులను అప్రమత్తం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు యాదగిరి, మైనార్టీ సెల్ నాయకుడు కలీమొద్దీన్ అహ్మద్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, సీనియర్ నాయకులు షాబొద్దీన్, రాజు, వాహబ్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రషీద్ పాల్గొన్నారు.

గోవర్ధనగిరిలో శానిటేషన్ డ్రైవ్



దోమల మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో శనివారం ఆరోగ్య వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లతో పాటు నీరు నిల్వఉన్న తొట్టెలపై దోమల నివారణ మందును పిచికారీ చేశారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బంది సాంబయ్య, కొమురయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పరిసరాలు, ఇళ్లలోను నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది వనజ, షరీద్ ఖాన్, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

అవినీతి పాలనకు నిలువెత్తు నిదర్శనం

దౌల్తాబాద్(దుబ్బాక): బీఆర్ఎస్ పదేళ్ల పరిపాలన అవినీతికి నిలువెత్తు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు అన్నారు. దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని బయట పెడుతున్నందుకే భయంతో కేసీఆర్, కేటీఆర్ సీఎం రేవంత్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు మాట్లాడుతూ త్వరలోనే కాళేశ్వరంలో ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన వారి పేర్లు బయటకు వస్తాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు స్వామి, సీనియర్ నాయకులు కర్నాల శ్రీనివాస్, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాములు

విద్యావంతులు చైతన్యం తీసుకురావాలి



రాజుయాదవ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యావంతులు, ఉద్యోగులు తమజాతి చైతన్యం కోసం పాటుపడి చైతన్యం తీసుకురావాలని శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్ హాల్ ఆర్థిక కార్యదర్శి బాగు యాదగిరి యాదవ్ అన్నారు. యాదవ ఎంప్లాయీస్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. యాదవ ఉద్యోగుల సమాచారాన్ని సాంకేతికంగా పొందుపరిచిన ధరబోయిన రాజు యాదవ్‌ను సత్కరించారు. అధ్యక్షుడు బైరి అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో చైతన్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రాజేశం, మల్లికార్జున్, చంద్రశేఖర్, రాజుయాదవ్, బాల్ నర్సయ్య, ఐలయ్య యాదవ్, రాజయ్య, రాజేశం, రమేశ్, భిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా కోలుకోవాలని పూజలు

మద్దూరు(హుస్నాబాద్): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మాజీ జీడికంటి సర్పంచ్ సుదర్శన్, మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య ఆధ్వర్యంలో శనివారం లద్నూరు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలో రావాలని ఆంజనేయస్వామిని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమక్కసోమయ్య, మాజీ ఉపసర్పంచ్ కుమారస్వామి, కొమురవెల్లి మాజీ డైరెక్టర్లు సిద్దారెడ్డి, కనుకరాజు, శ్రీను, భూపాల్‌రెడ్డి, కనుకచారి, శ్రీను వాస్‌చారి, ఆదాం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పెంపు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల గడువును 16వ తేదీ వరకు పొడిగించినట్టు ఎంఈఓ సత్యనారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడబ్ల్యూహెచ్, ఎంఎల్‌టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అర్హత కల్గిన మహిళలు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతు భరోసాకు..

చిన్నకోడూరు(సిద్దిపేట): కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను 20లోగా ఏఈఓలకు అందజేయాలని సూచించారు. గతంలో రైతు భరోసా పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు.

16 నుంచి పరిశీలన

కొండపాక(గజ్వేల్): స్పోర్ట్ పాఠశాలల్లో నాలుగో తరగతి ప్రవేశాలకు బాల బాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంఈఓ బచ్చలి సత్తయ్య తెలిపారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న స్కూళ్లలో ప్రవేశాలకు 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రతీ పాఠశాలలో బాలికల కోటాలో 20, బాలుర కోటాలో 20 సీట్ల చొప్పున ఉన్నాయని, 16 నుంచి దరఖాస్తుల పరిశీలన, ఎంపిక ప్రక్రియ ఉంటుందని చెప్పారు.

పేదల కల నెరవేర్చేందుకే ఇందిరమ్మ ఇళ్లు

బెజ్జంకి(సిద్దిపేట): పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ అన్నారు. మండలంలోని గాగిల్లాపూర్‌లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు శనివారం ఆయన ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ పులి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, నాయకులు సంతోష్, రాజు, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నక్షత్ర యూత్ అధ్యక్షుడిగా కిరణ్



కిరణ్

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మడద గ్రామంలో నక్షత్ర యూత్ సభ్యులు శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం యూత్ అధ్యక్షుడిగా బంటు కిరణ్, గౌరవ అధ్యక్షుడిగా బంటు మధు, ఎస్ఐ బంటు వెంకటేశ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గ్రామంలో ఉద్యోగాలు పొంది ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహించే వారు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తీర్మానించారు. సమావేశంలో రమేశ్, శ్రీకాంత్, అరవింద్, సంపత్, రాకేశ్, సాయి, చందు, సతీశ్, అశోక్, సందీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో జరిగిన లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిగౌడ్

తగాదాలతో జీవితాన్ని వృథా చేసుకోవద్దు

న్యాయమూర్తి స్వాతిగౌడ్

గజ్వేల్‌రూరల్: చిన్నచిన్న తగాదాలతో విలువైన జీవితాన్ని, సమయాన్ని వృథా చేసుకోవద్దని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్ సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో రాజీపడదగిన 939 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీపడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని మార్గం అన్నారు. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పీపీ శంకర్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

దుబ్బాకటౌన్: కక్షిదారులు చిన్నచిన్న కేసుల్లో పంతాలకు పోవద్దని, అటువంటి కేసులకు రాజీయే రాజమార్గమని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జితేందర్ అన్నారు. కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 398 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. క్షణికావేశంలో తప్పులు చేసి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ సోమశేఖర్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నేత రాజు

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిచెర్ల రాజు అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి సంకల్ప సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజు మాట్లాడుతూ 2014 నుంచి ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడిందన్నారు. జాతీయ భద్రతకు ప్రాధాన్యమిస్తూ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్, జన్‌ధన్ యోజన, పీఎం కిసాన్, తదితర పథకాలను ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, అజయ్‌వర్మ, మల్లేశం, రాములు, రామచంద్రం, రమేశ్, సునీత, శ్రీధర్‌రావు, సాన వేణు తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకి(సిద్దిపేట): మాట్లాడుతున్న రాజు

ఏబీవీపీ నేతపై దాడి అమానుషం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్యపై జరిగిన దాడి అమానుషమని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, నాయకులు బాపయ్య, నాగరాజు అన్నారు. చిన్నకోడూరులో వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌కు మద్దతుగా ఆదిత్య కార్యక్రమం నిర్వహించినందుకే దాడి చేశారని వాపోయారు. దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

రక్తదానంతో ప్రాణాలను కాపాడొచ్చు



రక్తదాతలను అభినందిస్తున్న శ్రావణి, రాజనర్సు తదితరులు

బ్లడ్ బ్యాంక్ అధికారి శ్రావణి

సిద్దిపేటకమాన్: రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదానం అన్ని దానాల కన్నా గొప్పదని ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారి డాక్టర్ శ్రావణి అన్నారు. వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా ఆస్పత్రిలో అత్యధిక సార్లు రక్తదానం చేసిన వారిని ఆర్ఎంఓ సదానందం, శ్రావణి శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు, వివాహ వేడుకలు, ఇతర ముఖ్యమైన రోజులకు గుర్తుగా రక్తదానం చేయాలని కోరారు. అత్యధిక సార్లు రక్తదానం చేసిన వారిని సన్మానించి, ప్రశంసా పత్రాలతో అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజనర్సు, కౌన్సిలర్ సాయికుమార్, సిబ్బంది కనకచంద్రం, ఆంజనేయులు, శ్రీనివాస్, ఇమ్రాన్, ప్రణీత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సురభి' ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం

సిద్దిపేటఅర్బన్: ప్రపంచ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని అర్బన్ మండలం మిట్టపల్లిలోని సురభి మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 63 మంది రక్తదానం చేశారు. ఆస్పత్రి పీఆర్వో పరశురాములు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తుల కులం, మతం, ప్రాంతం చూడకుండా ఏమీ ఆశించకుండా వెంటనే స్పందించి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేసే ప్రతి రక్తదాతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా.కరుణాకర్, జనరల్ సర్జన్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఉమమౌనిక, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.వెంకటరమణరెడ్డి, బ్లడ్ బ్యాంకు మెడికల్ అధికారి డా.రాజేందర్, టెక్నిషియన్స్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న దాతలు

ముక్కు మూసుకోవాల్సిందే..

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రంలోని రాజీవ్ రహదారి వెంబడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలో మురుగు నీరు నిలిచిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు ప్రక్కన ఉన్న ఇళ్ల నుంచి వచ్చే నీటితోపాటు వర్షపు నీరు కూడా నిత్యం రోడ్డు వెంబడి నిలిచిపోతుంది. హైదరాబాద్ నుంచి సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల తదితర పట్టణాలకు వెళ్లే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం ఈ దారిలోనే వెళ్తుంటారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రాజీవ్ రహదారి పక్కన నిలిచిపోయిన మురుగు నీరు

ఆశల మొలకలు..

ఈ సారి ముందస్తుగానే వర్షాలు కురవడంతో అన్నదాతలు ముందుగానే పత్తి విత్తనాలు నాటారు. రోహిణి కార్తెలో వేసిన విత్తనాలు ప్రస్తుతం మొలకెత్తాయి. మృగశిర కార్తెలో వేసిన విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని ఎక్కువ శాతం నల్లరేగడి భూములు ఉండడం వల్ల ఎక్కువ మంది పత్తిసాగు చేపట్టారు. ప్రస్తుతం కొన్ని చోట్ల పత్తిలో దంతె సాలు కొడుతున్నారు. పత్తి మొలకలు మొలవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్):



బిజివెంకటాపూర్‌లో మొలకెత్తిన పత్తి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990